# ప్రేమ... పెళ్ళి

సుజాత శివరామకృష్ణను ప్రేమించింది. పెళ్ళి చేసుకుంది. సంక్షిప్తంగా చెప్పాలంటే కథ ఇంతే! కొన్ని కథలు పెళ్ళి తరువాత మొదలవుతాయి. ఇంకొన్ని కథలు పెళ్ళితో ముగుస్తాయి. ఈ కథ రెండో కోవకు చెందినదని వేరే చెప్పనక్కరలేదు.

సుజాతకు తల్లి వుంది. అంటే ఆమెకు తండ్రి కూడా వున్నట్లేకాని అతనెప్పుడో స్వర్గస్థుడయ్యాడు. అందువలన సుజాతకు తల్లీ తండ్రీ ఆమె అమ్మ వసుంధరే. సుజాతకు చెల్లెలుంది. పేరు నీరజ. నీరజకన్నా సుజాత రమారమి రెండేళ్ళు పెద్దది. చిన్నతనంలోనే భర్తను కోల్పోయిన వసుంధర తన పసిపాపలను కనుపాపల్లా సాకింది. వసుంధర భర్త ప్రభుత్వోద్యోగికానందున ఆమెకు గ్రాట్యూటీ, పెన్షనులాంటివి ముట్టలేదు.

అభిమానమే మూలధనంగాగల సుజాత తండ్రికి ఆస్తిపాస్తులు లేవు. రెక్కల కష్టం మీదే భార్యా పిల్లలను పోషిస్తూ వారి ఉజ్వల భవిష్యత్తుకి బంగారుబాట వేయాలని కలలు గంటున్న సమయంలో విధి నిర్దాక్షిణ్యంగా అతడ్ని కబళించి ఆ కుటుంబాన్ని అనాథలుగా చేసింది.

తన భర్త ఆశయాలనే తన కర్తవ్యంగా భావించిన వసుంధర ఈ పని చేయవచ్చు ఆ పనిచేయరాదు అనే న్యూనత లేకుండా రాత్రీ పగలు శ్రమించి పిల్లలను విద్యావంతులుగా చేయడానికి కంకణం కట్టుకుంది. ఒంటరి ఆడది అందులోను పరిపూర్ణ యవ్వనవతికి ఎలాంటి సత్కారం చెయ్యాలో కొందరు పురుషపుంగవులకు తెలుసు.

మంచిమాటలు చెప్పో, మచ్చిక చేసుకునో, వంచనచేసో లేదా బలవంతంగానో భయపెట్టో ఆమెను అనుభవించాలని ఎందరో ప్రబుద్ధులు ప్రయత్నించి విఫలురయ్యారు. వసుంధర కత్తిమీద సాముచేస్తూ పిల్లలను చదివించింది.

సుజాత బి.ఏ. పరీక్ష రాసింది. తన కుమార్తె పరీక్ష తప్పి పోతుందన్న అనుమానం ఆ తల్లికిలేదు. ఆ పిల్ల భావి ఏమిటన్నదే ఆ మాతృమూర్తి తపన. ఇద్దరు ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేయాలి.

ఇంతవరకు తను సాధించింది ఒక ఎత్తు, ఇంకమీదట సాధించవలసింది మరొక ఎత్తు. వరాన్వేషణ ఎంత కష్టదాయకమైనదో ఆమెకు తెలుసు. సుజాత కోసం ఆమె కాళ్ళకు బలపాలు కట్టుకుని సంబంధాలకోసం ప్రయత్నాలు చేయసాగింది.

ఇప్పుడు మరికొన్ని పాత్రల పరిచయం చేయవలసిన అవసరం వచ్చింది.

శివరామకృష్ణ కూడా మధ్యతరగతి కుటుంబంలో పుట్టినవాడే. అతనికి తల్లీ తండ్రీ ఇద్దరూ వున్నారు. సుజాతకన్నా అయిదేళ్ళు పెద్దవాడు. వారూ సుజాత ఇంటికి దగ్గరలోనే వుండేవారు. చిన్నతనం నుంచి ఈ రెండు కుటుంబాల మధ్యా సఖ్యత వుంది. వసుంధర శివరామకృష్ణ తండ్రిని అన్నా అని సంబోధిస్తుంది. శివరామకృష్ణ భార్య వసుంధరను వదినా అంటుంది. వారిమధ్య ఎలాంటి రక్తసంబంధమూ లేదు.

పిల్లలు కలసి ఆడుకునేవారు. అన్యోన్యంగా వుండేవారు. ప్రేమ అనే పదానికి అర్థం తెలియని వయసులోనే సుజాతా శివరామకృష్ణల మధ్య అన్యోన్యత పెనవేసుకుంది. ఒకరిని వేరొకరు అభిమానించేవారు. ఒకరిపట్ల వేరొకరికి అనురాగం వుండేది. వయసు పెరుగుతున్నకొద్దీ వారి మధ్య అనురాగం ప్రేమగా పరిణితి చెందింది. సుజాతకు పరికిణీ ఓణీలు వేసుకునే వయసు రాగానే ఆమె తల్లి ఆమెపై ఆంక్షలు విధించింది. శివరామకృష్ణనుకాని మరే పురుషుణ్ణిగాని కలుసుకోరాదన్న ఆంక్ష విధించింది.

సుజాత పని అడకత్తెరలో పోకచెక్క అయింది. అటు తల్లిమాట కాదనలేదు. ఇటు శివరామకృష్ణను చూడకుండా వుండనూలేదు.

ఈ కుటుంబాలు ఇంత అన్యోన్యతగా వుండడం చూసిన ఇరుగు పొరుగులు సుజాత శివరామకృష్ణలు ఒకరి కోసం ఒకరు పుట్టారని తలచేవారు. అదే మాట అనేవారు. శివరామకృష్ణ తల్లిదండ్రులకు అప్పట్లో ఆ భావం వుండేది.

సజాత విషయం చెప్పనే అక్కరలేదు. శివరామకృష్ణే తన భర్త అనుకునేది.

వసుంధరకు కూడా శివరామకృష్ణ తన అల్లుడైతే బాగుండునని అనిపించింది.

అయినా ఆ ప్రస్తావన తమ అన్నగా భావిస్తున్న శివరామకృష్ణ తండ్రో లేక అతని తల్లో తెస్తే తన పని సులభమౌతుందని అనుకుంది. అడిగి కాదని పించుకోరాదనేదే ఆమె ఉద్దేశం.

"నీకేం పిచ్చా వసుంధరా! వెనుకటికెవరో ఒడిలో బిడ్డనుపెట్టుకుని ఊరంతా వెతికిందట. శివరామకృష్ణ వుండగా నీ కూతురి కోసం ఇతరత్రా సంబంధాలు వెతుకుతున్నావు. అతనికేం తక్కువ?" అన్నారు కొందరు.

"ఓసి నీ బంగారం కూలా! ఎంతైనా వారు మగ పెళ్ళివారు. నీ కూతుర్ని వాళ్ళెలా అడుగుతారు. అది సాంప్రదాయంకూడా కాదు. నువ్వే వాళ్ళ నడగాలి. మనసులో అనుమానా లుంచుకొని సుజాత ఇష్టపడేవాడిని కాకుండా చేస్తావా?" అంటూ కొందరు హితవు చెప్పారు.

వసుంధరకు వాళ్ళు చెప్పింది సరైనదే అనిపించి తనే శివరామకృష్ణ తండ్రితో స్వయంగా మాట్లాడింది.

"చెల్లెమ్మా సుజాత మా కోడలు కావడం మా అదృష్టంగా భావిస్తాము. ఎంతైనా పెళ్ళి అనగానే కొన్ని వేడుకలు, కొన్ని ఆచారాలు వుంటాయి. మా వాడు ఎం.ఏ. పాసయ్యాడు. పోస్టలులో పని చేస్తున్నాడు. ఏభైవేల వరకూ ఇస్తాం అంటూ ఎక్కడెక్కడినుంచో సంబంధాలు వస్తున్నాయి. పైసా కట్నం తీసుకోకుండా మా అబ్బాయి పెళ్ళి చేయడానికి మేం ఆదర్శవంతులం కాము. ఈ సమాజంలోని  సగటుమనుషులం. నీ మీద అభిమానం వుంది. పాతికవేలు కట్నం ఇస్తే శివా మీ అల్లుడౌతాడు" అన్నాడు శివరామకృష్ణ తండ్రి.

వసుంధరకు వాళ్ళ తత్వం అర్థమైంది. ఎక్కడైనా బావకాని వంగతోటలో కాదు అన్న సామెత ఉట్టినే పుట్టలేదు. వీళ్ళ మధ్యవున్నవి అనుబంధాలు, అనురాగాలు కావు. డబ్బుకి అమ్ముడుపోయే మనుషులు. తనా కట్నం ఇచ్చుకోలేదు.

తల్లి చెప్పిన విషయాలు విని సుజాత నిర్ఘాంతపోయింది. శివరామకృష్ణ తనకన్యాయం చేస్తాడని ఆమె అనుకోలేదు. కట్నం తీసుకోవాలనే అభిప్రాయం అతని తల్లిదండ్రులది కావచ్చు కాని శివరామకృష్ణ తన ప్రేమను తృణీకరిస్తాడా?

"బావా! ఒకమారు పసిప్రాయంలో వేణుగోపాల స్వామివారికని బొగడపూలమాలకడితే అది తీసుకొని నీవు నా భార్యవంటూ నా మెడలో వేశావు. పెద్దఅయిన తరువాత మనం పెళ్ళి చేసుకుందాం అని బాసచేశావు గుర్తుందా?" అంటూ "మీ అమ్మా నాన్నా మన పెళ్ళికి సుముఖంగా లేరు" అంది.

"సుజాతా! అది నిజంకాదు. వారు మన పెళ్ళికి సుముఖులే. అయితే వాళ్ళు కట్నం కావాలన్నారు. అది తప్పా?" అన్నాడు శివ.

"శివా! నీకు కాని మీ వాళ్ళకు కాని మా పరిస్థితులు తెలియవా? పాతికవేలు కట్నం మా అమ్మ ఎక్కడనుంచి తెస్తుంది. ఆమె ఇవ్వలేదనేగా వారా గొంతెమ్మ కోరిక కోరారు. నీవు వారికి నచ్చచెప్పలేవా?" అని అడిగింది.

"సుజాతా! ఎంతైనా వారు నా తల్లిదండ్రులు. వారి మాటకు ఎదురుతిరగలేను. నే నశక్తుడిని. చిన్నతనంలో చేసిన బాసమాటా? అది నీకూ తెలుసు పసితనమని. ఆ వయసులో కన్న కలలు యధార్థాలవుతాయా? మనం పరిస్థితులతో రాజీపడాలి"

శివరామకృష్ణను ఎంతో ఉన్నతంగా ఊహించుకుని తను పొరపాటు చేసింది.

సుజాత పరిస్థితులతో రాజీపడింది. తన పెళ్ళి తల్లికో సమస్య కారాదు. కనీసం తన చెల్లెలైనా దాంపత్యజీవితంలో సుఖపడాలి. స్థిరపడాలి. తను వారికోసం త్యాగం చేయడంలేదు. ప్రథమ సంతానమైన తను కుటుంబ బాధ్యతలను స్వీకరించాలి.

ఆమె అందుబాటులోని ఉద్యోగంలో చేరింది. అధిక పరిశ్రమచేసి డిపార్టుమెంటు పరీక్షలు

పాసై ఆమె ప్రమోషన్లు సంపాదించింది.

ఆ విధంగా ఆమె వున్న ఊరుకి దూరమైంది. శివరామకృష్ణను మరిచిపోయింది.

నీరజ పెళ్ళి ఘనంగా జరిపించింది.

వసుంధరకు మాత్రం తృప్తి కలుగలేదు. పెద్ద పిల్ల కన్యగానే వుండిపోయింది. అది ఒక ఇంటిదైతే చూసి ఆనందించాలన్నదే ఆమె ఆవేదన.

నీరజ భర్త బిడ్డలతో సుజాత ఇంటికొచ్చింది.

సుజాతకు వారి రాక మోదాన్ని చేకూర్చినా వసుంధర లోలోనే పెద్దకూతురు సుజాతను తలచుకొని కుమిలిపోయింది.

నీరజ భర్త సుజాతను పెళ్ళి చేసుకుందికి ముందుకి వచ్చాడు. కానీ నీరజకు తన అక్క పెళ్ళి చేసుకుని ఒక ఇంటిదైతే, ఆ తరువాత తను కన్యగా మిగిలిపోవాలి. బ్రతుకుతెరువు కోసం తను ఉద్యోగం చేయాలి. అందుకే ఆ పెళ్ళికి నీరజ నిరసన తెలిపింది. చెల్లెలి మనస్తత్వం గ్రహించి సుజాత అతడ్ని ఒప్పించి నీరజతో పరిణయం జరిపించింది. అది తన కర్తవ్యం, బాధ్యతా అనుకుంది.

"సుజాతా! శివరామకృష్ణ వచ్చాడు. నువ్వు ఇష్టపడితే నిన్ను పెళ్ళి చేసుకుంటానన్నాడు. మూర్ఖంగా ప్రవర్తించకు. పురుషుడికైనా స్త్రీకైనా పెళ్ళితోనే పరిపూర్ణత లభిస్తుంది. ఆనాడు తిరస్కరించాడని ఈనాడు నువ్వు పగ సాధించకు. ఇలాంటి అవకాశం మళ్ళీరాదు." అంది వసుంధర కూతురు ఆఫీసునుంచి రాగానే.

శివరామకృష్ణ ఎవరో సుజాతకు గుర్తుకు రాలేదు. తల్లి చెప్పిన విషయాలు విన్న తరువాత అర్థమైంది. ఇన్నాళ్ళకు అతనికి ఈ అభిప్రాయం ఎందుకు వచ్చింది? ఇంకా పెళ్ళి చేసుకోలేదా?

తల్లి తన దగ్గర ఏదో దాచినట్లు సుజాతకు తోచింది. నీరజ కూడా అక్కకు హితవు చెప్పింది.

"శివరామకృష్ణ మరో అరగంటలో వస్తాడు. ముందుగా నువు కోరుకున్నవాడే. అప్పుడు పరిస్థితులు అనుకూలించలేదు. ఈనాడు తనంతట తనే వచ్చాడు" అంది.

"అమ్మా! నాకు పెళ్ళిమీద అనిచ్ఛలేదు. శివరామకృష్ణలో పదేళ్ల తర్వాతనైనా మార్పువస్తే నేను అతడ్ని అభినందిస్తాను. ఆ ప్రస్తావనలో న్యూనత పరిచే విషయం లేకుంటే నేనెందుకు మూర్ఖంగా ప్రవర్తిస్తాను" అంది సుజాత.

శివరామకృష్ణ వచ్చే టైముకి తన చెల్లెలుకాని మరిదికాని ఇంట్లో వుండకూడదనే ఉద్దేశంతో వారిని సినిమాకు పంపింది. "నీ పిల్లను నేనూ అమ్మా చూసుకుంటాం. మీరిద్దరూ వెళ్ళిరండి" అంది.

శివరామకృష్ణ అన్న సమయానికి వచ్చాడు. వసుంధర వారిద్దరిని గదిలో వదిలేసి కాఫీ చేస్తానన్న మిషమీద వంటింటిలోనికి వచ్చింది.

"సుజాతా! మీ అమ్మగారు అన్ని విషయాలు నీకు చెప్పే వుంటారనుకుంటాను. ఆనాడు పరిస్థితుల ప్రభావంవలన మనం భార్యాభర్తలం కాలేక పోయాము. నువ్వు ఇష్టపడితే నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను. తెలియనివయసులో చేసిన బాసను నిలబెట్టుకుంటాను" అన్నాడు శివరామకృష్ణ.

"శివా! ఇప్పుడు నీ తల్లిదండ్రుల అభ్యంతరం వుండదా?" అడిగింది సుజాత.

"నీకు తెలియదు. మా నాన్నగారు చనిపోయి ఆరేళ్ళైంది. మా అమ్మకూడా ఈమధ్యనే స్వర్గస్థురాలైంది" అన్నాడు శివరామకృష్ణ.

"అయ్యో పాపం! ఇప్పుడు నువ్వు నన్ను పెళ్ళి చేసుకున్నా అడ్డుపడేవారులేరన్నమాట"

శివరామకృష్ణ లేరన్నట్లు తలూపాడు.

"శివా! ఇంతకాలం నువ్వు పెళ్ళిచేసుకోలేదా?"

"సుజాతా! మీ అమ్మగారు నీకే విషయాలు చెప్పలేదా? ఆనాడు నా తల్లిదండ్రుల అభిమతం మేరకు నేను పెళ్ళిచేసుకున్నాను. ఇప్పుడు నాకిద్దరు పిల్లలు. పెద్దవాడు అయిదేళ్ళవాడు. చిన్నది ఏడ్పర్థంది. నా భార్య గత నెలలో చనిపోయింది.

పిల్లలకోసం మళ్ళీపెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను. నీవింకా పెళ్ళి చేసుకోలేదని తెలిసింది. అందుకే హుటాహుటిన నీ దగ్గరకొచ్చాను. నీ చేతుల్లో అయితే నా పిల్లలకు తల్లిలేని కొరత వుండదు" అన్నాడు అతను.

తన తల్లి ఏం దాచిందో ఇప్పుడు సుజాత కర్థం అయింది. "శివా! అయితే నీ పిల్లలకొక ఆయా కావాలన్నమాట. నీకు నేను గుర్తుండడం నా అదృష్టమే" అంది ఆమె.

"సుజాతా! అది నీ అదృష్టం కాదు. నా అదృష్టంగా భావిస్తాను" అన్నాడు.

"శివా! ఒక్క నిముషం. ఇప్పుడే వస్తాను" అంటూ సుజాత వేరే గదిలోనికి వెళ్ళి నీరజ రెండేళ్ళ కూతుర్ని ఎత్తుకుని వచ్చింది.

"నేనింకా పెళ్ళి చేసుకోలేదని ఎవరో చెప్పారన్నావు. అది యదార్థంకాదు. ఈ బిడ్డ నా పాప. నా భర్త పెళ్ళి జరిగిన ఆరు నెలలకే రోడ్డు ప్రమాదంలో మరణించాడు. నిన్ను పెళ్ళి చేసుకోవడానికి నాకెలాంటి అభ్యంతరం లేదు. నీ పిల్లల తల్లి బాధ్యత నేను స్వీకరిస్తాను. నా పాపకు నువ్వు తండ్రిగా బాధ్యత స్వీకరించాలి" అంది.

శివరామకృష్ణ నోటమాట రాలేదు. ఒక విధవను పైగా సంతానవతిని భార్యగా

స్వీకరించడమే కాక ఆపిల్లకు తండ్రిగా బాధ్యత స్వీకరించగలడా?

శివరామకృష్ణ సమాధానం చెప్పలేదు. దిగ్గునలేచి వెళ్ళిపోయాడు. సుజాతకు అందులో విస్మయం కలిగించే అవకాశంలేదు. తనే కోరి అతనికి పరీక్ష పెట్టింది. అమాయకుడు మోసపోయాడు. తన నైజం ఏమిటో చెప్పకనే చెప్పాడు.

కాఫీ ట్రేతో వచ్చిన వసుంధర నిర్ఘాంతపోయింది. "నువ్వు దురదృష్టవంతురాలివి. నీ జాతకంలో పెళ్ళి అయ్యే యోగంలేదు. చేతికందిన అవకాశాన్ని బుద్ధిపూర్వకంగా జారవిడుచుకున్నావు. అతనితో అబద్ధం చెప్పవలసిన అవసరం ఏం వచ్చింది?" అంది తలపట్టుకుంటూ.

"అమ్మా! వివాహాలు స్వర్గంలో జరుగుతాయంటారు. నీ తపన నాకు అర్థమౌతుంది. అవివాహితగా వుండిపోవడం నా అభిమతం కాదు. సమయానుకూలంగా రంగులు మార్చే ఊసరవెల్లులను ఎలా నమ్మడం? నీకింతవరకు నేనో విషయం చెప్పలేదు. నేనొకతడిని ప్రేమించాను. అతడూ నన్ను చేసుకుందికి అంగీకరించాడు. ఒక సంవత్సరంపాటు ట్రైనింగుకి జపాను వెళ్ళాడు. ఈ మధ్యనే తిరిగి వచ్చాడు. మావివాహం వచ్చేవారం రిజిస్ట్రారు ఆఫీసులో జరుగుతుంది. అమ్మా నువ్వు మాటిమాటికి అంటూండేదానివి 'నీ పెళ్ళి అయివుంటే ఇద్దరు ముగ్గురు పిల్లల తల్లివై వుండేదానివని' ఇద్దరు ముగ్గురు కాకున్నా, నా పెళ్ళికి నేనొక బిడ్డ తల్లినౌతున్నాను" అంది సుజాత.

మరి కథకు ముగింపుకావాలిగా! సుజాత పెళ్ళి చేసుకుంది.

– స్వాతి మాసపత్రిక